సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 19 । జూన్ । 2023



మండలానికి ఇద్దరు..!

విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తాజాగా ఎంఈఓ–2 పోస్టును ప్రభుత్వ సృష్టించింది. దీంతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. - IIలో



కొలువుల సంబరం

సంక్షేమంలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ అండగా నిలుస్తోంది. - IIలో

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో దాసరి ప్రతిభ



పార్వతీపురం టౌన్‌: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పార్వతీపురం పట్టణానికి చెందిన దాసరి సాకేతినాయుడు ఆల్ ఇండియా స్థాయిలో 12వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ఓబీసీ కేటగిరీ లో మొదటి ర్యాంకును సాధించాడు. తండ్రి సురేష్‌నాయుడు, తల్లి అణిత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. సివిల్స్‌కు ఎంపిక కావడమే తన ముందున్న లక్ష్యమని సాకేతినాయుడు చెప్పాడు.

న్యూస్‌రీల్

పులి సంచారం

- పాదముద్రలు గుర్తించిన అటవీ శాఖ అధికారులు



బంగారువలస సమీపంలో పులి పాదముద్రలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు

మక్కువ: మండలంలోని బంగారువలస గ్రామం సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలో పులి పాదముద్రలను ఆటవీశాఖ అధికారులు ఆదివారం గుర్తించారు. గతంలో కన్నంపే గ్రామం సమీపంలో పులి సంచరించగా, కొద్ది రోజులు క్రితం కొండరేజేరు గ్రామం సమీపంలోని రెండు ఆవులను బలి తీసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం బంగారువలస గ్రామం సమీపంలో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించడంతో మండల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. బంగారువలస గ్రామం సమీపంలోని ఆయిల్‌పామ్ తోట నుండి, పార్వతీపురం మండలం అడారుగెడ్డ వైపు వెళ్లినట్లు మక్కువ ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు తెలిపారు. బంగారువలస, కోన, దబ్బగెడ్డ, సరాయివలస గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

ఏజెన్సీలో భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పగటిపూట ఎండ ఠారెక్కించడంతో పాటు వడగాడ్పులు వీయడంతో ప్రజలంతా బెంబేలెత్తిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో ప్రారంభమై సుమారు గంట పాటు భారీ వర్షమే కురిసింది. దీంతో ఏజెన్సీ వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలంతా ఉపశమనం పొందారు.

డీసీసీబీలో పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్ష



సీతం ఇంజనీరింగ్ కాలేజీలో ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ)లో వివిధ పోస్టుల భర్తీకి ఆదివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. మేనేజర్ పోస్టులు 6, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు 20, స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులు 32కి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని సీతం ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్ష నిర్వహించారు. మేనేజర్ పోస్టులకు 264 మంది దరఖాస్తు చేసుకోగా 222 మంది పరీక్షకు హాజరు అయ్యారు. 42 మంది గైర్హాజరయ్యారు. అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 737 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 504 మంది హాజరయ్యారు. స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులకు 1659 మంది దరఖాస్తు చేసుకోగా 1282 మంది పరీక్షకు హాజరయ్యారు. 377 మంది గైర్హాజయ్యారు.

బొడ్డవర వద్ద పట్టాలు తప్పిన గూడ్స్

- కొత్త ట్రాక్‌పై ప్రమాదం
- పట్టాలు తప్పిన ఆరు వ్యాగన్లు



ట్రాక్ తప్పి కూరుకుపోయిన వ్యాగన్లు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర వద్ద గూడ్స్ రైలు ఆదివారం సాయంత్రం పట్టాలు తప్పింది. కిరండూల్ నుంచి విశాఖకు ఐరన్ ఓర్‌తో వస్తున్న గూడ్స్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆరు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ప్రమాద సమయంలో 20 కి.మీ వేగంతో రావాల్సిన రైలు 40 కి.మీ వేగంతో రావడం ప్రమాదానికి కారణం కావచ్చని రైల్వే అధికారులు చెబుతున్నారు. వరుసగా ఉన్న నాలుగు వ్యాగన్లు పట్టాలు తప్పగా మధ్యలో రెండు మినహా తరువాత మరో రెండు వ్యాగన్లు మొత్తంగా ఆరు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఐరన్ ఓర్ సమాంతరంగా వేయకపోవడం ప్రమాదానికి ఒక కారణం కావచ్చని భావిస్తున్నారు. సోమవారం నాటికి ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తవుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

ఇక సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు



- గ్రామ సచివాలయాల్లో ప్రారంభమైన సేవలు
- చలానా, డాక్యుమెంట్లు రాయడం, ఫీజుల చెల్లింపు తదితరవన్నీ అక్కడే..
- రిజిస్ట్రేషన్ సేవలకు జిల్లాలో 101 సచివాలయాల ఎంపిక
- విడతల వారీగా అన్నింటికీ విస్తరణ
- జాయింట్ సబ్ రిజిస్ట్రార్ – 3గా సచివాలయ కార్యదర్శి
- గ్రామీణులకు తప్పనున్న వ్యయప్రయాసలు

గ్రామ స్వరాజ్యం.. జాతిపిత మహాత్మా గాంధీ కలలగన్న రాజ్యం. దీని కోసం రాష్ట్రంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తన వంతు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ సేవలన్నీ ప్రజల చెంతకు చేరేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వలంటీర్లను నియమించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకే చేర్చుతుంది. ఇప్పుడు తాజాగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సచివాలయాల్లోనే ప్రారంభిస్తూ మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధమైంది.



సచివాలయాల్లో సేవలందిస్తున్న సిబ్బంది



లక్ష్మీనారాయణపురం గ్రామ సచివాలయం

పార్వతీపురం టౌన్‌: జిల్లాలో గతంలో ఏ రకమైన రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా సుదూర ప్రాంతాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలి. ఇందుకు ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. దీనికి తోడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద దళారుల దోపిడీ. వీటన్నింటికీ చెక్ పెట్టి స్థానికంగా ఉన్న గ్రామ/వార్డు సచివాలయాల్లోనే అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలు అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి వాటి అమలుకు శ్రీకారం చుట్టాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా సచివాలయాలు

ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 4 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రిజిస్ట్రార్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలంటే రెండు నుంచి మూడు రోజులు కార్యాలయాల చుట్టూ తిరగాలి. అయినా సకాలంలో పని పూర్తవుతుందో లేదో తెలియదు. ఇక నుంచి ఇటువంటి ఇబ్బందులు లేకుండా చెంతనే ఉన్న సచివాలయాల్లో సులభంగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు. జిల్లా వ్యాప్తంగా రీ సర్వే పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో కొన్నింటిని ఎంపిక చేశారు. అందులో జిల్లాలో 15 మండలాల్లోని 101 సచివాలయాలు ఎంపిక చేశారు. వీటిలో నూతనంగా రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించనున్నారు. ఇలా విడతల వారీగా మరో ఏడాదిలోపు జిల్లాలోని అన్ని గ్రామ, సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించేందుకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ – 3గా సచివాలయ కార్యదర్శి వ్యవహరిస్తారు.

భూ రీసర్వేతో కబ్జాలకు చెక్

ఎప్పుడో బ్రిటీష్ పరిపాలనలో చేసిన సర్వేనే ఇప్పటికీ ఆధారం. దీంతో భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు గందరగోళంగా ఉన్నాయి. ఫలితంగా గ్రామాల్లో భూ వివాదాలు పెరిగిపోతున్నాయి. కొన్ని చోట్ల ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడుతున్నారు. ఇకపై ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా సర్వే నంబర్లలో సబ్ డివిజన్లకు ప్రభుత్వం స్వస్తి పలుకుతోంది. ఉదాహరణకు 1, 1ఏ, 1బీ, 2బీ/ ఎలాంటి సబ్ డివిజన్ సర్వే నంబర్లు ఇక నుంచి ఉండవు. సర్వే నంబర్ 1, 2 ఇలా ఒకే నంబర్ ఉంటాయి. ఇప్పటి వరకు సబ్ డివిజన్లు సృష్టించి అక్రమాలకు పాల్పడుతూ భూ రీసర్వేలో ఊరు, సచివాలయ పరిధి, మండలం కనబరుస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ పక్కాగా ఉంటుంది. ఒకరి భూమిని మరొకరు కబ్జా చేసే పరిస్థితి ఉండదు.

సచివాలయాల్లో అందించే రిజిస్ట్రేషన్ సేవలు

అక్నాలెడ్జ్‌మెంట్ అప్డేట్, డేటా ఫీడింగ్, చెక్ స్లిప్, రెగ్యులర్ నంబర్ కేటాయింపు, ఫొటో, వేలిముద్రలు తీసుకోవడం, డాక్యుమెంట్ ప్రింటింగ్, స్కానింగ్, విక్రయ దస్తావేజు, సెటిల్‌మెంట్ దస్తావేజు, దానవిక్రయం, తనఖా, చెల్లు రసీదు, భాగ పరిష్కారం రిజిస్ట్రేషన్ రద్దు, మాన్యువల్ ఈసీ, ఆన్‌లైన్ ఈసీ, మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికెట్, వివాహ రిజిస్ట్రేషన్ తదితర సేవలు అందిస్తారు.

జిల్లాలో రిజిస్ట్రేషన్లకు ఎంపిక చేసిన సచివాలయాలు

పాలకొండ మండలంలో అట్టలి, అరదాల, అవలంగి, ఎరకరాయపురం, కొండాపురం, గోపాలవెంకటాపురం, గుడివాడ, చింతాడ, చినకోటిపల్లె, చినకోటిపల్లె, తుమరాడ, నక్కపేటపారాపురం, నవగాం, పెండ్యాలరామాపురం, పాట్లి, పద్మాపురం, పురుశురామపురం, బెజ్జి, మల్లివీడు, లుంబూరు, వటపాగు, వెలవాడ, సిరికొండ సచివాలయాలను రిజిస్ట్రేషన్ల కోసం ఎంపిక చేశారు. అలాగే కొమరాడ మండలంలో అర్తాం, కందివలస, కోమట్లపేట, కుమ్మరిగుంట, దేవునిగుంప, నిమ్మలపాడు, పెదకేర్జిల, సోమలింగాపురం, సివిని. కురుపాం మండలంలో అరికకొరిడి, గరుగుబిల్లి మండలంలోని సీతారాంపురం, శవ్వాం, గుమ్మలక్ష్మీపురం సచివాలయం, జియ్యమ్మవలస మండలంలో అక్కన్నదొరవలస, గంగమ్మవలస, జోగిరాజుపేట, శిఖబడి, శివరామరాజపురం సచివాలయాలు, పాచిపెంట మండలంలో కొత్తవలస, తోటవలస, బొబ్బిలివలస, మల్లపురాజుపేట, పార్వతీపురం మండలంలోని అప్పన్నదొరవలస, చినబొండపల్లి, టోంకి, తాడంగివలస, నిశ్శంకపురం, పులిగుమ్మి, లక్ష్మీపురం, బలిజిపేట మండలంలోని కూర్మనాధపురం, జనార్ధనపురం, పదమాయవలస, డబేవలస, భైరిపురం, మిర్తివలస, మురగడాం, భామిని మండంలోని పక్కుడిభద్ర, బత్తిలి, బొమ్మిక, వడ్డంగి, మక్కువ మండలంలోని చంద్రయ్యపేట, చిన్నంరాజువలస, తోటవలస, నారాయణ రామచంద్రరాజపురం, పెదఘుశిల, పాపయ్యవలస, బంగారువలస, బట్టివలస, మూకవలస, సింగందొరవలస, సంతేశ్వరం సచివాలయాలు, వీరఘట్టం మండలంలోని తలవరం, పనసనందివాడ, బోడ్లపాడు, బూరుగ, సీతంపేట మండలంలోని అడ్డాకులగూడ, కొండపేట, కిరప, గుడిగుడి, చిమరామ, పనుకువలస, బర్న, మేకువ, వాబ సచివాలయాలు, సీతానగరం మండలంలోని సీతానగరం, కె.శీతారాంపురం, కొత్తవలస, గంగరాజపురం, చిన్నరాయుడుపేట, జగన్నాధపురం, నీలకఠాపురం, పాపమ్మవలస, బగ్గందొరవలస, సాలూరు మండలంలోని గురువినాయునివలస, చంద్రప్పవలస, తెంటు బొడ్డవలస, దేవుబుచ్చెంపేట, బాగువలస, భవానీపురం సచివాలయాలను రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం ఎంపిక చేసింది.

రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు సిద్ధం



సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌కు ఆరు నెలలు శిక్షణ అందజేశాం. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ చేశారు. కొద్దిపాటి సాంకేతిక సమస్యలు ఉండటంతో వాటిని అధిగమిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రకాల రిజిస్ట్రేషన్లను సచివాలయం ద్వారా పొందవచ్చు.

– ఎం.పూర్ణచంద్, జిల్లా రిజిస్ట్రార్, పార్వతీపురం మన్యం

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు..



వారణాసి దీపేష్, ఆలిండియా ర్యాంక్ 272, వీరఘట్టం



పెద్దింటి శ్రీబాలాజీఅభిషేక్, ఆలిండియా ర్యాంక్ 472, చినభోగిలి



అంపిలి హేమంత్‌కుమార్, ఆలిండియా ర్యాంక్ 866, పాలకొండ



శంబంగి వర్షిణి, ఆలిండియా ర్యాంక్ 929, పార్వతీపురం

జేఈఈ అడ్వాన్స్‌డ్ – 2023 ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. ఆలిండియా స్థాయిలో మంచి మార్కులు సాధించి ర్యాంకులు కొట్టారు. వీరి ఎంపిక పట్ల జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



రౌతు సాయినారాయణ, ఆలిండియా ర్యాంక్ 731, పాలకొండ



శంబంగి వర్షిణి, ఆలిండియా ర్యాంక్ 929, నందివానివలస గ్రామం, గరుగుబిల్లి మండలం

డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

- ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు
- రిజర్వేషన్ల రోస్టర్ పాయింట్ల వారీగా సీట్ల కేటాయింపు
- 6 ప్రభుత్వ, 40 ప్రైవేటు కళాశాలల్లో 16 వేల మంది డిగ్రీ కోర్సులకు అవకాశం

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 2023 – 24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను ఆదివారం విడుదల చేసింది. ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇందుకు మార్గదర్శకాలు రూపకల్పన చేశారు. ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ అడ్మిషన్స్ అనే విధానాన్ని అనుసరించనున్నారు. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆధీనంలో ఆన్‌లైన్ అడ్మిషన్స్ నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 6 ప్రభుత్వ, 40 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఎంఆర్ సంస్కృత, ప్రభుత్వం డిగ్రీ కళాశాల టౌన్, చీపురుపల్లి, రాజాం, ఎస్‌కోట, గజ పతినగరం ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది కొత్త కోర్సులు వచ్చే అవకా శం ఉంది. రెండు రోజుల్లో వాటి వివరాలు తెలుస్తా యని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పీవీకృష్ణాజీ తెలిపారు.

షెడ్యూల్ ఇలా...:

నోటిఫికేషన్ విడుదల చేసిన మరుసటి రోజు ఈ నెల 19వ నుంచి 24వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 21 నుంచి 23వ తేదీ వరకు స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్ ఉంటుంది. ఫిజికల్లీ ఛాలెంజ్డ్/సీపీసీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఏక్టవిటీస్/ఎన్‌సీసీ/గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్లు విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల, విశాఖ పట్టణం డాక్టర్ వీఎస్‌కృష్ణా కళాశాల, తిరుపతి ఎస్‌వీ యూనివర్సిటీలలో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. కళాశాలలు, కోర్సులను ఎంచుకోవడం కోసం 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌కి అవకాశం ఇస్తారు. వచ్చే నెల 7వ తేదీన సీట్ల కేటాయింపు ఆన్‌లైన్‌లో ప్రకటిస్తారు. అలాట్ అయిన అభ్యర్థులకు ఎంపికయిన కళాశాలల్లో 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

సీట్ల కేటాయింపు ఇలా..

గతంలో డిగ్రీ అడ్మిషన్స్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ వారీ గా నిర్వహించేవారు కాదు. అయితే ఈ ప్రభుత్వం వచ్చిన ప్పటి నుంచి డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేశారు. ఇంటర్మీడియెట్‌లో కామర్స్ ఒక సబ్జెక్టుగా చదివిన వారికి మొత్తం బీకాం కోర్సుల్లో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. అదేవిధంగా ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారికి మొత్తం బీఏ సీట్లలో 50 శాతం సీట్లు కేటాయిస్తారు.

ప్రసవాలలో భేష్...

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు
- సర్కారీ ఆస్పత్రులపై పెరిగిన నమ్మకం
- జిల్లా ఏర్పడిన నాటి నుండి ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11,200 ప్రసవాలు

రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు అమాంతం మారాయి. నాడు – నేడు ద్వారా ఆస్పత్రుల్లో సకల సదుపాయాలు కల్పిస్తున్నారు. అవసరమైన సిబ్బందిని నియమిస్తున్నారు. ఫలితంగా రోగులకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరిగింది. ముఖ్యంగా గర్భిణులు సుఖ ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరుతున్నారు.



జిల్లా ఆస్పత్రిలో సిజేరియన్ ప్రసవాల విభాగం

ఆస్పత్రుల వివరాలు...

జిల్లాలో గైనిక్ సేవలందించే ప్రభుత్వాస్పత్రులు	48
24 గంటలు పనిచేసే పీహెచ్‌సీలు	37
సాధారణ పీహెచ్‌సీలు	05
సీహెచ్‌సీలు	03
ఏరియా ఆస్పత్రులు	03
ఎస్ఎన్‌సీయూ	01
జిల్లా ఆస్పత్రి	01

పార్వతీపురం టౌన్‌: గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సేవలకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవ సేవలు పొందేందుకు గర్భిణులు ఆసక్తి చూపుతున్నారు. ఆస్పత్రి వైద్యులు కూడా సుఖ ప్రసవాలు చేసి వారి వేదనను దూరం చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన నాటి నుండి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 15,982మంది ప్రసవం అయితే అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 11,200 మంది ప్రసవాలు పొందడం విశేషం.

గర్భిణుల ఆసక్తి

ప్రభుత్వాస్పత్రులకు గర్భిణులను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. సుఖ ప్రసవాలు చేసి వేదనను దూరం చేస్తున్నారు. తల్లీ పిల్లలను కంటికి రెప్పలా సాకుతున్నారు. కోలుకున్నాక తల్లీపిల్లల ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నారు. పైసా ఖర్చు లేకుండా అందించే సేవలు పొందేందుకు గర్భిణులు ఆసక్తి చూపుతున్నారు. దీనికి ప్రభుత్వాస్పత్రుల్లో నమోదవుతున్న ప్రసవ కేసులే నిలువెత్తు నిదర్శనం. అక్కడి వైద్యులు, సిబ్బంది అందించే సేవలకు కొలమానం. పాలన మారింది. 'నాడు–నేడు' అనేలా ప్రభుత్వాస్పత్రులకు మౌలిక సదుపాయాలు సమకూరాయి. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు జరిగాయి. సేవల్లో జవాబుదారీతనం పెరిగింది. ఫలితం.. ప్రభుత్వాస్పత్రుల్లో అందించే వైద్యంపై జనంలో నమ్మకం పెరిగింది. అధిక మంది గర్భిణులు సర్కారు దవాఖానాల్లో వైద్యసేవలు పొందుతున్నారు.

వైద్యుల నియామకంతో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యపరికరాలు ఉన్నప్పటికీ కొన్ని కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు లేకపోవడంతో పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆస్పత్రికి కేసులు వస్తున్నాయన్న విషయాన్ని గ్రహించిన అధికారులు జిల్లాలో 18మంది వైద్యుల కొరత ఉందని ప్రభుత్వానికి నివేదికను పంపారు. తక్షణమే స్పందించిన ప్రభుత్వం నూతనంగా ఏర్పడ్డ మన్యం జిల్లాకు 18మంది వైద్యులను నియమించింది. దీంతో జిల్లాలోని వైద్యుల కొరత లేకపోవడంతో గర్భిణుల ప్రసవానికి పీహెచ్‌సీల్లో వీలవుతుంది. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూ యూనిట్

ఆస్పత్రుల్లో నెలల తక్కువగా పుట్టినా, బరువు తక్కువగా పుట్టినా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి కోసం ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూ వార్డును ఏర్పాటు చేశారు. జిల్లా ఆస్పత్రి కేంద్రంలో అధునాతన సాంకేతికతతో కూడిన ఎస్ఎన్‌సీయూ యూనిట్లలో వైద్యాన్ని అందజేస్తున్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక వ్యాక్సిన్లను ఆస్పత్రుల్లోనే వేస్తున్నారు. ఈ సౌకర్యాల వల్ల గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా



జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారు. అంతే కాకుండా ఆస్పత్రుల్లో వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో అందించని వైద్యాన్ని జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో అందిస్తున్నారు. ప్రజలకు నమ్మకం పెరిగింది. ముఖ్యంగా మహిళలు ప్రసవాలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వస్తున్నారు. అందుకు తగ్గ ఆస్పత్రుల్లో సుఖప్రసవాలకు తొలిప్రాధాన్యం ఇస్తున్నాం.

– డా. బి.జగన్నాధరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

సకల సదుపాయాలు



ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులు చేరగానే అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నాం. సాధారణ ప్రసవాలు జరిపేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. అవసరమైన వారికి సిజేరియన్ చేస్తున్నాం. గర్భిణులకు ప్రత్యేక ప్రసూతి విభాగం, ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశాం. ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయి. మాతాశిశ సంరక్షణకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రసవ కేసుల సంఖ్య పెరిగింది. పుట్టిన పిల్లల కోసం ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూ యూనిట్‌లో ప్రత్యేకంగా వైద్యాన్ని అందిస్తున్నాం.

– డా. బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం మన్యం

చంటిపిల్లల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ



అప్పుడే పుట్టిన పిల్లల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపి వైద్యాన్ని అందిస్తున్నాం. నెలలు తక్కువ వున్న, బరువు తక్కువ వున్న పిల్లలకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే అధునాతన సాంకేతికతతో కూడిన ఎస్ఎన్‌సీయూ యూనిట్లో వైద్యాన్ని అందజేస్తున్నాం. పిల్లలకు వ్యాక్సినేషన్‌ను తక్షణమే ఆస్పత్రిలోనే వేస్తున్నాం. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది.

– డా. బి.గణేష్ చైతన్య, ఎస్ఎన్‌సీయూ వైద్యులు, జిల్లా ఆస్పత్రి

క్లుప్తంగా

మూడు పశువుల వ్యాన్‌ల సీజ్

బొండపల్లి: మండలం మీదుగా జాతీయ రహదారి26పై అక్రమంగా మూడు బొలెరో వ్యాన్‌లలో పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. మానాపురం నుంచి విజయనగరం వైపు అక్రమంగా ఆదివారం మూడు వ్యాన్‌లలో 23 పశువులను తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎస్.రవి తెలిపారు. వ్యాన్‌లను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సూర్య ప్రతాపం



పార్వతీపురం పట్టణంలోని ప్రధాన రహదారి

పార్వతీపురంటౌన్: కొద్ది రోజుల నుంచి భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మండుతున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అంతటా 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం పార్వతీపురం, జిల్లాలోని ఇతర పట్టణాల్లో పిల్లలు, వృద్ధులు, గర్భిణులు బయటకు రాలేదు. అత్యవసర పనులపై వచ్చిన వారు శీతలపానీయాలు, జ్యూస్‌లు, కొబ్బరిబొండాలను తాగుతూ సేదతీరుతున్నారు. వేడికి గాలిలో తేమశాతం పడిపోవడంతో పాటు వడగాడ్పులు తోడయ్యాయి. ద్విచక్ర వాహనదారులు వేడిగాలులకు తాళలేక చెట్ల నీడకు వెళ్తున్నారు. ఆదివారం ఎండలకు దాదాపు జిల్లాలోని అన్ని పట్టణాలు, వీధులు వెలవెలబోయాయి. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రధాన జంక్షన్లన్నీ నిర్మానుష్యమయ్యాయి. ఉపాధి కూలీల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఊరికి దూరంగా చెరువు పనులకు వెళ్లిన వారు తాగునీరులేక అవస్థలు పడుతున్నారు. సూర్యుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు వెనుకడుగు వేస్తున్న పరిస్థితి నెలకొంది.

మండలానికి ఇద్దరు..!

- విద్యావ్యవస్థలో నూతన శకం
- ఉమ్మడి జిల్లాల్లో పూర్తయిన ఎంఈఓ2 నియామకాలు
- ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల హర్షం



వీరఘట్టం మండల విద్యాశాఖ కార్యాలయం

వీరఘట్టం: అమ్మ ఒడి పథకం, నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, జగనన్న విద్యాకానుక ద్వారా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం ఇలా 8 రకాలు వస్తువులను విద్యార్థులకు అందజేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అలాగే ప్రతి మండలానికి ఇద్దరు మండల విద్యాశాఖాధికారులు ఉంటే విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చునని తాజాగా ఎంఈఓ–2 పోస్టును సృష్టించి మరో సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఆదివారం ఎంఈఓ–2 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులైన ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ–2గా నియమిస్తూ వారికి సముచిత స్థానం కల్పించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

పూర్తయిన ఎంఈఓ–2ల నియామకం

శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల్లో ఆదివారం చేపట్టిన ఎంఈఓ–2 పోస్టుల నియామకానికి చేపట్టిన కౌన్సెలింగ్ పూర్తయింది. శ్రీకాకుళం జిల్లాలో 38 మంది, విజయనగరం జిల్లాలో 34 మందిని ఎంఈఓ–2గా ప్రభుత్వం నియమిస్తూ జాయినింగ్ ఆర్డర్లు అందజేసింది. ప్రస్తుతం శ్రీకాకుళంలో ఎంఈఓ–1 పోస్టులు 38కి గాను 12 ఖాళీలు ఉన్నాయి. అలాగే విజయనగరంలో 34 ఎంఈఓ–1 పోస్టులకు కూడా 12 ఖాళీగా ఉన్నాయని, త్వరలో ఆ పోస్టులు కూడా భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇకపై పక్కాగా పర్యవేక్షణ

ఒకప్పుడు మండల విద్యాశాఖాధికారిగా ఉండే వారు ఆఫీసు అడ్మినిస్ట్రేషన్‌తో పాటు పాఠశాలలను మానిటర్ చేసేవారు. అంతేకాకుండా నాడు–నేడు పనుల పర్యవేక్షణ, మధ్యాహ్న భోజన నిర్వహణ పర్యవేక్షించేవారు. ఈ క్రమంలో కొంత పనిభారం అయ్యేది. ఇప్పుడు ఎంఈఓ–2 పోస్టు నియామకంతో పనిభారం తగ్గడంతో పాటు పాఠశాలలను పక్కాగా పర్యవేక్షించి సర్కారు బడులను బలోపేతం చేయవచ్చని, ఇటువంటి సాహసోపేతమైన నిర్ణయాలతో విద్యావ్యవస్థలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో నిలిచిపోతారని విద్యావేత్తలు అంటున్నారు.

పాఠశాలల పర్యవేక్షణ బాగుంటుంది

ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలు ఉండడం వల్ల పాఠశాలల పర్యవేక్షణ బాగుంటుంది. అలాగే ఆఫీసు అడ్మినిస్ట్రేషన్‌తో పాటు మధ్యాహ్న భోజన నిర్వహణ, తరగతి గదిలో విద్యాబోధన తదితర అంశాలను సులువుగా పర్యవేక్షించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవచ్చు.

– ఎస్.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం

ఎంఈఓ–2 నియామకం మంచి నిర్ణయం



ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలు ఉండాలని, కొత్తగా ఎంఈఓ–2 పోస్టును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. అడ్మినిస్ట్రేషన్, మానిటరింగ్ చేయడం ఇద్దరు ఎంఈఓలకు సులువుగా ఉంటుంది. పనిభారం తగ్గడంతో ప్రశాంతంగా పాఠశాలలను పర్యవేక్షించి విద్యా ప్రమాణాలు మెరుగుపర్చవచ్చు.

– మజ్జి పైడిరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం

ఎంఈఓ–2 నియామకంతో ప్రమోషన్లు



ప్రభుత్వం చేపట్టిన ఎంఈఓ–2 పోస్టు నియామకాల వల్ల మిగిలిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు వస్తాయి. మండల స్థాయిలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎంఈఓ–2 పోస్టు నియామకం ఎంతో దోహదపడుతుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కేపీనాయుడు, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు, సంత–నర్సిపురం, జెడ్పీ హై స్కూల్, వీరఘట్టం

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



డేగల సన్యాసి మృతదేహం

జామి: మండలంలోని అలమండ కోరుకొండ రైల్వే స్టేషన్ల మధ్య రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం 40నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వ్యక్తి మృతదేహం అలమండ, కోరుకొండ రైల్వేస్టేషన్ల మధ్య లభ్యమైంది. మృతుడి శరీరంపై తెలుపు నీలం ఆకుపచ్చ రంగులతో నిడువు గడుల లుంగీ, తెల్లని కట్ బనియన్ ఉన్నాయి. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తల భాగం నుజ్జునుజ్జయింది. ఘటనా స్థలానికి రైల్వే ఎస్సై రవివర్మ, పీసీ శ్రీనివాస్ వెళ్లి పరిశీలించి, వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666555214, 9490617089 నంబర్లను సంప్రదించాలని ఎస్సై రవివర్మ కోరారు.

చికిత్స పొందుతూ బాలిక..

రాజాం సిటీ: ఆత్మహత్యా యత్నం చేసిన మండల పరిధి నర్సింహపురం గ్రామానికి చెందిన యర్రా ఝాన్సీ (17) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిందని ఎస్సై పి.నీలావతి తెలిపారు. చీపురుపల్లి మండలం గుణిదాం గ్రామానికి చెందిన యర్రా సోంబాబు కుమార్తె ఝాన్సీ నర్సింహపురంలోని అమ్మమ్మ గారి ఇంట్లో ఉంటోంది. ఆమె తరచూ ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ భోజనం కూడా సరిగా తినకపోవడంతో కుటుంబసభ్యులతోపాటు తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 16న గడ్డిమందు తాగేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

వడదెబ్బకు గురై వృద్ధుడు..

జామి మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన వృద్ధుడు డేగల సన్యాసి(72) వడదెబ్బకు గురై ఆదివారం మృతిచెందాడు. మండలకేంద్రం జామి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన సన్యాసి మళ్లీ ఆటోలో ఎస్.కోట వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. ఆటోలో ఇంటికి వచ్చిన కొంత సమయానికే వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై మృతిచెందాడు. గ్రామసర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం తదితరులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

చికిత్స పొందుతూ మహిళ..

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఈనెల14న బుధవారం సాయంత్రం కారు ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాల పాలైన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై ఎస్.రవి తెలిపారు. సాలూరులోని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కారులో విజయనగరం వస్తుండగా ప్రమాదంలో అక్కడిక్కడే ఒక మహిళ మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో మారోతు సునీత(35) మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా పడి ఒకరు..



పార్వతీపురం: పాపారావు మృతదేహం

పార్వతీపురం: మండలంలోని డోకిశిల పంచాయతీ బుచ్చింపేట గ్రామం సమీపంలో ఆటో బోల్తా పడడంతో తెలగడవలసకు చెందిన యడ్ల పాపారావు (34) ఆదివారం మృతి చెందగా మరో వ్యక్తి గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలం తెలగడవలస నుంచి పార్వతీపురం మండలం సంగంవలస పంచాయతీ మడకవానివలసకు ఓ శుభ కార్యక్రమానికి ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యడ్ల అప్పారావు అక్కడికక్కడే మృతి చెందగా, బి.పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన పవన్ పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు మేరకు పార్వతీపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు..



లారీ ఢీకొని మృతిచెందిన వెంకటరావు

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి గ్రామ సమీపంలో ఓలం కంపెనీ ప్రాంతంలో ఎదురెదురుగా వస్తున్న లారీ, బైక్ ఢీకొనడంతో సంఘటనాస్థలంలోనే ద్విచక్రవాహనచోదకుడు మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై గంగరాజు తెలిపారు. సాలూరు మండలం శివరాంపురం గ్రామానికి చెందిన జరజాపు వెంకటరావు ద్విచక్ర వాహనంపై గజపతినగరం మండలంలోని దానరిపేట వెళ్లేందుకు కొత్తరోడ్డు మలుపు వద్ద తిరుగుతుండగా, తూర్పుగోదావరి జిల్లా నుంచి సాలూరు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే వెంకటరావు మృతిచెందాడని ఆయన తెలిపారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

కొలువుల సంబరం

- స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా జాబ్‌మేళాల నిర్వహణ
- నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తున్న సీఎం జగన్



విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ చేతులు మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్ అందుకుంటున్న వసంతనాయుడు



జూన్ 9న చీపురుపల్లిలో జరిగిన జాబ్ మేళాకు హాజరైన యువతీ, యువకులు(ఫైల్)

చీపురుపల్లి: సంక్షేమ పరిపాలన సాగించడంలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరోవైపు నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ అండగా నిలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 1.3 లక్షల మంది యువతకు సచివాలయాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టిన సంగతి తెలిసిందే. సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో 3 లక్షలకు పైగా యువతకు ఉన్న ఊరిలోనే ఉపాధి అవకాశాన్ని కల్పించారు. దీంతోబాటు యువత కోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తద్వారా అన్ని నియోజకవర్గాల్లో మెగా జాబ్ మేళాలు నిర్వహించి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్దేశించారు. ఈ జాబ్‌మేళాల్లో పదో తరగతి నుంచి బీటెక్ వరకు చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా పదుల సంఖ్యలో కంపెనీల నిర్వహిస్తున్న జాబ్ మేళాలు సఫలీకృతమవుతున్నాయి. వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

ఒకే రోజు 683 మందికి ఉద్యోగావకాశాలు



ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా నిరుద్యోగ యువతీ, యువకుల కోసం పెద్ద ఎత్తున జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ సూచనల మేరకు ఈ నెల 9న చీపురుపల్లిలో గల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహించాం. 1878 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. 19 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసేందుకు వచ్చారు. అదేరోజు 683 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. దశల వారీగా వారందరికీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి ఉద్యోగాలకు పంపిస్తున్నాం. నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి.

– గోవిందరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, విజయనగరం

చీపురుపల్లిలో జాబ్ మేళా సక్సెస్..

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చొరవతో జూన్ 9న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం నేతృత్వంలో చీపురుపల్లిలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 19 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. అంతేకాకుండా 1878 మంది నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాల కోసం వచ్చారు. వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఒక్కరోజులో 683 మందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేశారు. మరో 88 మందిని రెండో రౌండ్ కోసం ఎంపిక చేశారు.

వరుణ్ మోటార్స్‌లో ఉద్యోగం వచ్చింది..



మాది నెలిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామం. డిగ్రీ చదువుకున్న నేను ఊరిలోనే ఉపాధి కోసం చిన్న వ్యాపారం చేసుకుంటున్నాను. చీపురుపల్లిలో ఈ నెల 9న మెగా జాబ్ మేళా కోసం తెలుసుకున్నాను. అక్కడికి వెళ్లి ఇంటర్వ్యూ ఎదుర్కొన్నాను. నాకు విజయనగరంలోని వరుణ్ మోటార్స్‌లో ఉద్యోగం లభించింది.

కెల్ల త్రినాథ్, కొండవెలగాడ, నెలిమర్ల మండలం, విజయనగరం జిల్లా

గ్రీన్‌టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగం.....



మాది చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస గ్రామం. బీటెక్(మెకానికల్) చదువుకున్నాను. ఇప్పటికే చిలకపాలెం దగ్గరలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాను. ఈ నెల 9న జాబ్‌మేళాకు హాజరయ్యాను. నెల్లూరుకు చెందిన గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ వారు నన్ను ఎంపిక చేశారు. భోజనం, వసతి కలిపి నెలకు రూ.15,500 వేతనం ఇస్తామని చెప్పారు.

పట్టా రాము, పత్తికాయవలస, చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా

గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగం వచ్చింది..

నేను డిప్లమో(ఎలక్ట్రికల్) చదువుకున్నాను. రెండు సంవత్సరాలు సీపీఎస్ పరిశ్రమలో పని చేశాను. చీపురుపల్లిలో ఈ నెల 9న నిర్వహించిన మెగా జాబ్ మేళాలో గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ నాకు ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగానికి ఎంపిక చేసింది. ఇలాంటి జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతుంది.

– వసంతనాయుడు, లక్ష్మీపురం, సీతానగరం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

12 మంది కోడి పందాల రాయుళ్ల అరెస్టు

భోగాపురం: మండలంలోని గుడివాడ గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆదివారం దాడి చేసి 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. అరెస్టు చేసిన వారి నుంచి ఆరు కోడి పుంజులు, రూ.21,330 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వృద్ధుడి ఆత్మహత్య

బొబ్బిలి: కుమారుడు అనారోగ్యంతో మంచానికి అతుక్కుపోయి చాలా రోజులుగా ఉండిపోవడంతో చలించిపోయిన తండ్రి పెనుగంటి కూర్మినాయుడు(77) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని చిత్రకోట బొడ్డవలసకు చెందిన మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉండగా కుమారుడు తిరుపతిరావు పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన కూర్మినాయుడు కుమారుడు పరిస్థితిని తట్టుకోలేక పురుగు మందు తాగడంతో కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన విద్యార్థి దువ్వారపు మణికంఠ కనిపించడం లేదని తండ్రి ఎర్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన మణికంఠ తనకు నచ్చిన కళాశాలలో చేర్పించమని పట్టుబట్టగా, తల్లిదండ్రులు నిరాకరించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అతడి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నవగ్రహ శాంతి హోమం

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని దారగంగమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామి వారి సన్నిధిలో దేవా లయ అర్చకులు రాజగోపాలాచార్యుల నేతృత్వంలో వేదపండితులు ఆదివారం నవగ్రహ శాంతి హోమం జరిపించారు. నరఘోష, దిష్టి దోష నివారణ కోసం హోమం చేశామని అర్చకులు తెలిపారు. పుణ్యగిరి ట్రస్టుబోర్డు చైర్మన్ పాలమరశెట్టి రామకృష్ణ, భక్తులు తరలివచ్చారు.

ఎస్.కోట ఎంఈఓ–2గా లక్ష్మి

శృంగవరపుకోట: మండల రెండో విద్యాశాఖాధికారి(ఎంఈఓ)గా పాదం గణపతి లక్ష్మి నియామకమయ్యారు. విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్ లో ఎంఈఓ–2గా ఈమె నియమితులయ్యారు.

ఈదురుగాలుల బీభత్సం

వంగర: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అకస్మాత్తుగా పెద్దఎత్తున గాలులు వీయడంతో ఎం.సీతారాంపురం–వంగర గ్రామాల మధ్య ఐదు విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. ఎం.సీతారాంపురం పంట పొలాలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు మాత్రమే సరఫరా నిలిపివేసి, అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ కె.వినయ్‌కుమార్ తెలిపారు.



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పశువుల శాలలు దగ్ధం

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలసలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి ఎనిమిది పశువుల శాలలు దగ్ధమయ్యాయి. అధిక విద్యుత్ లోడ్ కారణంగా విద్యుత్ తీగలనుంచి నిప్పులు రాలడంతో ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బోను రామారావు, రామస్వామి, పోలినాయుడు, శంకరరావు, సీతంనాయుడు, సింహాచలం, శంకరరావు, కర్రి సీతంనాయుడులకు చెందిన రేకుల పశువుల శాలలు పూర్తిగా ఆహుతయ్యాయి. అలాగే కర్రి సీతంనాయుడుకు చెందిన ఆరు బస్తాల ధాన్యం, శంకరరావుకు చెందిన మోటార్ పైపులు, సింహాచలానికి చెందిన టేకు కలపతో పాటు పలు పరికరాలు ధ్వంసమయ్యాయి. బోను పోలినాయుడికి చెందిన లేగదూడ అగ్ని ప్రమాదంలో గాయాలపాలైంది. ఈ ప్రమాదవార్త తెలిసిన వెంటనే పార్వతీపురం అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో జరిగిన నష్టాన్ని అంచనావేసి ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.





కాలిపోతున్న పశువుల శాలలు

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,110–00
బంగారం(22సి. 10గ్రా.)	55,100–00
వెండి (కిలో)	78,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹158	₹286	₹ 296